క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు పసపాం విద్యార్థి



విద్యార్థిని లక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పూసపాటిరేగ: మండలంలోని పసపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జి. లక్ష్మి జిల్లా స్థాయిలో హైజంప్‌లో విజేతగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం ఆర్. నాగేశ్వరరావు తెలిపారు. దీంతో విద్యార్థినిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

రోగులకు నేత్ర పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

డెంకాడ: చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో విజయనగరం మండలంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 52 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి కార్యక్రమాల్లో భాగంగా విజయనగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రిలో రోగులను పరీక్షించి శస్త్రచికిత్సలకు 21 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్ పిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డీన్ ఎస్.మోహన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్.షణ్ముఖరావు, ఎఫ్‌వైఎఫ్‌పీ కన్వీనర్ కేఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



పూసపాటిరేగ ప్రాథమిక పాఠశాలలో తనిఖీలు చేస్తున్న ఎంఈఓ పాపినాయుడు, తదితరులు

పూసపాటిరేగ: విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల పనితీరుపై మండల విద్యాశాఖాధికారులు బి. పాపినాయుడు, బి. దుర్గాప్రసాద్ గురువారం పలు పాఠశాలలను తనిఖీ చేశారు. పూసపాటిరేగ, బొర్రవానిపాలెం, లంకలపల్లిపాలెం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వివిధ అంశాల ఆధారంగా పాఠశాలకు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు గ్రేడ్‌లు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గజపతినగరం ఎంఈఓ బి. సాయిచక్రధర్, మోపాడ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ నాగ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

విజయనగరం రూరల్: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ (ఎస్బీసీసీ) జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు జేసీ మయూర్ అశోక్ సూచనలతో విజయనగరం మండలం గుంకలాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కొండమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.


26న కార్తీక దీపోత్సవం



ఆహ్వాన ప్రతులను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో ఈ నెల 26న కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం సీతారామయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆ రోజు సాయంత్రం ఐదు గంటలకు 1116 మంది మహిళా భక్తులతో దీపోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు చాణక్య, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణ తగదు



రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: రైల్వేను ప్రైవేటీకరించడం తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైల్వే శాఖ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి,, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్‌మోహన్, బి.రమణ, నగర ఉపాధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, గోపి, రాఘవ, కలాసీ సంఘ నాయకులు రమణ, తదితరులు పాల్గొన్నారు.

నమ్మకమైన పాలన...



విజయనగరం: 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కోలగట్ల కృష్ణారావు, తదితరులు



నెల్లిమర్ల రూరల్: చంద్రంపేటలో పార్టీ జెండా ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు సుధారాణి, సన్యాసినాయుడు, శ్రీరాములనాయుడు, తదితరులు



డెంకాడ: అమకాంలో సంక్షేమ,అభివృద్ధి పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు,వైస్ ఎంపీపీ తమ్మునాయుడు, తదితరులు

ఎన్నో ప్రభుత్వాలు మారాయి.. ఎంతో మంది పాలకులు వచ్చారు.. వెళ్లారు.. కాని ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించుకున్న అతి కొద్ది మంది పాలకుల్లో జగన్ మోహన్‌రెడ్డి ఒకరు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తూ.. అర్హులందరికీ పార్టీలకతీతంగా పథకాలు అందిస్తూ ఆర్థికంగా భరోసా కల్పించిన ధీశాలి జగనన్న. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజల ముంగిటకు పాలన తీసుకువచ్చి, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించిన వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి. అటువంటి మనసున్న మారాజు నాయకత్వం రాష్ట్రానికి అవసరమని భావిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వాడవాడలా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలకు వివరించారు.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



పూసపాటిరేగ: కనిమెల్లలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలనాయుడు , తదితరులు



భోగాపురం: కవులవాడ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి



విజయనగరం రూరల్: సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి అప్పలనాయుడు, తదితరులు

ప్రజలందరిపై వడ్డి పోలమ్మ ఆశీస్సులు



వడ్డి పోలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

• డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: నగరంలోని లంకాపట్నంలో వేంచేసిన వడ్డి పోలమ్మ ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆశాభావం వ్యక్తం చేశారు. వడ్డిపోలమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆమె అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎంతో మహిమ కలిగిన అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఐదు సంవత్సరాలకు ఓసారి జరుగుతున్న ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారని చెప్పారు. ఆలయ పునర్నిర్మాణానికి తనవంతు సహాయంగా రెండు లక్షల రూపాయల విరాళాన్ని అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్లూరు శ్రీనివాసరావు, పొట్నూరు వెంకటరాజు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి



మహాధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెల్లిమర్ల: ఈ నెల 27,28 తేదీల్లో విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని వామపక్ష ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని జరజాపుపేట అమరవీరుల స్మారక స్థూపం వద్ద మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామపక్ష ప్రజా సంఘాల నాయకులు కిల్లంపల్లి రామారావు, కాళ్ల అప్పలసూరి, కనకల పద్మనాభం మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల కార్మిక, కర్షక రంగం తీవ్రంగా నష్టపోయిందని, కార్పొరేట్లకు ప్రయోజనం కలిగే విధంగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పలువురు వామపక్ష ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడంలో ఫుడ్ బ్యాంక్‌లు కీలకం



ఫుడ్ బ్యాంక్‌లో పేదలకు ఆహారాన్ని వడ్డిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: పేదల ఆకలి కష్టాలను తీర్చేందుకు నగరంలో ఏర్పాటు చేసిన ఫుడ్ బ్యాంకులు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటున్నాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభిప్రాయపడ్డారు. నగరంలోని పోలీస్ బ్యారెక్స్ వద్దనున్న ఫుడ్‌బ్యాంక్‌ను గురువారం సందర్శించి పేదలకు స్వయంగా ఆహారాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో ఆరు చోట్ల ఫుడ్ బ్యాంకులు రెండు సంవత్సరాలుగా నిరాటంకంగా కొనసాగిస్తున్నామన్నారు. పేద ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఆకలి తీర్చే కేంద్రాలుగా ఫుడ్ బ్యాంకులు అలరారుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు పెట్టి అవకతవకలకు పాల్పడిందన్నారు. దీంతో వాటిని రద్దు చేయడం జరిగిందని తెలిపారు. తాము ఎటువంటి రుసుం వసూలు చేయకుండా ప్రతిరోజూ వెయ్యి మందికి పైగా ఆరు కేంద్రాల ద్వారా ఆహారం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యనారాయణ, నారాయణప్పడు పాల్గొన్నారు.

త్వరితగతిన నేత్ర శస్త్రచికిత్సలు



పుష్పగిరి ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

• డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో గుర్తించిన వారికి త్వరితగతిన నేత్ర శస్త్రచికిత్సలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. నగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా శస్త్ర చికిత్సల కోసం వచ్చిన రోగులతో మాట్లాడుతూ, ఆపరేషన్లు బాగా చేస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్ట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ఏకాదశి పూజలు



వేంకటేశ్వరస్వామికి పూజలు

డెంకాడ: చింతలవలస వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుద్ధ ఏకాదశి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే సుప్రభాత సేవ, విష్ణు సహస్రనామ, తులసి అర్చనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పాదయాత్రకు గంటా సంఘీభావం



రఘురాజును కలిసిన సతీష్

నెల్లిమర్ల: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ పాదయాత్ర చేపడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గంటా సత్యనారాయణ(సతీష్) సంఘీభావం తెలిపారు. రాజమండ్రి సమీపంలోని నల్లజర్ల వద్ద రఘురాజును కలిసి అభినందనలు తెలియజేశారు. రఘురాజుతో పాటు కొంతదూరం పాదయాత్రలో పాల్గొన్నారు. దీనికి ముందు ఎమ్మెల్సీ పాదయాత్ర ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తికావాలని, జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో సతీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంతి

భగవాన్ సత్యసాయి బాబా జయంతి విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున నగర సంకీర్తనలు నిర్వహించి, అనంతరం మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనలు నిర్వహించారు. అలాగే విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



భోగాపురం: మండల కేంద్రంలోని సత్యసాయి మందిరంలో సామూహిక పూజలు



నెల్లిమర్ల: గాంధీనగర్‌లో జయంతి వేడుకలు



నెల్లిమర్ల రూరల్: తంగుడుబిల్లిలో నగర సంకీర్తన



విజయనగరం ఫోర్ట్: పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీరామ్మూర్తి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి..

నెల్లిమర్ల: అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి తడిచిన వరి పైరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో అకాల వర్షాలకు వరి పంట నీటమునిగిందన్నారు. కనీసం 50 శాతం పంట కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. ఎకరానికి రూ.50 వేలకు పైగా ఖర్చు పెట్టిన రైతుకు తిండి గింజలు కూడా దక్కే పరిస్థితి లేదన్నారు. ఒక పక్క తెగుళ్లు.. మరో పక్క అకాల వర్షాలు రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి ఆదుకోవాలని కోరారు.

ఐరన్ మాత్రలతో రక్తహీనత నివారణ

విజయనగరం ఫోర్ట్: రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు వేయాలని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ అన్నారు. గురువారం స్థానిక ఫూల్‌బాగ్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జైన్ , ఏఎన్‌ఎం నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్యశ్రీ'పై అవగాహన కల్పించాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీ ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కల్పించాలని నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా ఏకాదశి పూజలు

విజయనగరం టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ వద్దనున్న శ్రీమన్నార్ రాజగోపాల స్వామి ఆలయంలో కార్తీక ఏకాదశి పూజలు గురువారం ఘనంగా జరిగాయి. వేకువజామునుంచే వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించేందుకు తరలివచ్చారు. దేవస్థానం కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

అభినందనలు



విజేతలతో పాఠశాల కరస్పాండెంట్ స్వరూప, హెచ్‌ఎం శేఖర్, తదితరులు

విజయనగరం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విజేతలను గురజాడ స్కూల్ యాజమాన్యం గురువారం అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పూడి శేఖర్ మాట్లాడుతూ.. యూత్ క్లబ్, సత్యసాయి కమిటీలు నిర్వహించిన పోటీలలో తమ పాఠశాలకు చెందిన దాదాపు 30 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష ప్రయోగ రంగంలో ఉద్యోగావకాశాలు అధికం



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: అంతరిక్ష ప్రయోగ రంగంలో ఉన్నత విద్యను పొందిన విద్యార్థులకు రానున్న రోజుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికమని తారామండల్ టెక్నాలజీస్ ప్రైవేట్ సంస్థ కో ఫౌండర్ ఏవీసీఎల్ జడ్సన్ అన్నారు. ఈ మేరకు గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో 'అంతరిక్షంలో అద్భుత అవకాశాలు' అనే అంశంపై గురువారం జరిగిన ఒక రోజు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష రంగంలో దేశం దూసుకుపోతోందని రానున్న రోజుల్లో అంతరిక్ష రంగంలో వ్యాపారం ఒక ట్రిలియన్ డాలర్‌కు చేరుకుంటుందన్నారు. ప్రైవేట్ సంస్థలకు కూడా అంతరిక్ష ప్రయోగాలకు అవకాశం ఇచ్చిందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ త్వరలో సీతం విద్యార్థులతో ఉపగ్రహం తయారు చేయడానికి తారా మండల్ టెక్నాలజీతో ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.దామోదరనాయుడు, ట్రిపుల్ ఈ విభాగాధిపతి వై.సంతోష్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముడిదాంలో 'గడప గడపకు..'

విజయనగరం రూరల్: మండలంలోని ముడిదాం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, సర్పంచ్ చిట్టి ఆదిలక్ష్మి, గొల్లలపేట ఎంపీటీసీ సభ్యుడు రమణ, ఎంపీడీఓ గంటా వెంకటరావు, మండల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అవినీతి, లంచగొండితనం లేని పారదర్శక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు